# 9/11

## కథ: రాయుడు వృద్ధుం

1963 ఆగష్టు 18వ తారీఖు. రాత్రి తొమ్మిది గంటలు.

అప్పుడే భోజనం చేసి వీధి గుమ్మంలో అరుగు మీద కూర్చున్నాడు మూర్తి. వెన్నెల రాత్రి. ఆకాశం చాల నీలంగా వుంది. నక్షత్రాలు మిణుకు మిణుకు మంటున్నాయి. పశ్చిమం దిక్కున శాంతాక్రూజ్ వేపు విమానాలు ఆకాశంలోకి దూసుకుపోతున్నాయి. అది బొంబాయి (ముంబై) నగరంలో ఖార్ ఏరియాలో అన్నయ్య ఇల్లు.

ఆ విమానాల టేకాఫ్ చూస్తూ వుంటే మూర్తికి ఎన్నో ఆశలు కలుగుతున్నాయి. మూర్తి ఐ.ఐ.టి. ఖరగ్‌పూర్ లో బి.టెక్. చేసి ఉద్యోగాన్వేషణకి బొంబాయి వచ్చి, వారం రోజులయి అన్నయ్య ఇంట్లో వుంటున్నాడు. అప్పుడే రెండు ఇంటర్వ్యూలయాయి. మూర్తికి అమెరికా వెళ్ళి పి.హెచ్.డి. చేయాలని ఎప్పటినించో పట్టుదల.

'నేను కూడా ఒక రోజు విమానంలో అమెరికా వెడతాను చూడు!' అని మనసులో ఉబలాటపడ్డాడు.

ఇంతలో అన్నయ్య శాస్త్రి కూడా అరుగుమీద కూర్చుని , 'ఏరా! ఎలాగయింది లార్సెన్ అండ్ టుబ్రోలో ఇంటర్వ్యూ?' అని అడిగాడు.

'నెక్స్ట్ వీక్ చెబుతాం అన్నారన్నయ్యా!' అన్నాడు.

శాస్త్రి ఒక పెద్ద బ్యాంకులో మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. మూర్తి కొంచెంసేపు అరుగుమీద కూర్చుని అన్నయ్యతో ఏవో కబుర్లు చెప్పి ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

ఉదయం లేచి మళ్ళీ ఇంటర్వ్యూలకి బొంబాయి ఫోర్ట్ ఏరియాకి ట్రెయిన్‌లో బయల్దేరాడు. ఇంటర్వ్యూల యాక అమెరికన్ (యు.ఎస్.ఐ.ఎస్.) లైబ్రరీకి వెళ్ళాడు. అక్కడ మధ్యాహ్నమంతా కూర్చుని, అమెరికన్ యూనివ ర్సిటీలలో గొప్ప యూనివర్సిటీల గురించీ వాటికి ఎలా అప్లయ్ చేయటం, ఫైనాన్షియల్ ఎయిడ్ ఎలా వస్తుంది లాంటి విషయాలన్నిటినీ పరిశోధించాడు. తరువాత కాల్ టెక్, ఎం.ఐ.టి. లాంటి ఇంజనీరింగ్ కాలేజీలకీ, అంటే ఓ పది యూనివర్సిటిలకి అప్లయ్ చేయటం జరిగింది.

1963 సెప్టెంబర్ 11న పవాయ్ దగ్గర లార్సెన్ అండ్ టుబ్రోలో జూనియర్ ఇంజనీర్‌గా చేరాడు. ఒక సంవత్సరం పాటు అక్కడ ఉద్యోగం చేస్తుండగా, పై అధికారులు మూర్తిని ఒక ప్రాజెక్టు మీద జర్మనీ పంపించారు. అక్కడ పదమూడు వారాలు వుండి తిరిగి బొంబాయి వచ్చాడు. మొట్టమొదటగా ఒక పశ్చిమ దేశం వెళ్ళొచ్చాక కొంచెం భాషా తీరూ అన్నీ మారటం మొదలయ్యాయి. అన్నయ్య ఇల్లు వదిలి మెరైన్ డ్రైవ్ లో ఒకచిన్న ఫ్లాట్ అద్దెకు తీసుకుని బ్యాచెలర్ లైఫ్ మొదలెట్టాడు. ఫాక్టరీ నించీ కంపెనీ హెడ్ క్వార్టర్స్‌లో, ఫోర్ట్ ఏరియాలో ప్రమోషన్ మీద ఇంకొక డిపార్ట్‌మెంట్లో ఉద్యోగం చేస్తున్నాడు. సరే అన్నీ బాగున్నాయి..... ఇంక అన్నయ్య, వదిన, అమ్మ,

మావయ్య అందరూ మూర్తిని పెళ్ళి చేసుకోమని ఒత్తిడి చేయటం మొదలుపెట్టారు.

‘నేను అమెరికా వెళ్ళాలి.. పి.హెచ్.డీ. చేయాలి... పెళ్ళి చేసుకోను అని జవాబు చెప్తూ వాళ్ళ ఒత్తిడి తప్పించు కుంటూ వుండేవాడు. కానీ శంకరం మామయ్య, అమ్మతో కలిసి, తన ప్రయత్నాలు మానలేదు. అమ్మ శాంతమ్మ, శంకరం మామయ్య మొత్తానికి మూర్తిని ఒప్పించి 1964 ఫిబ్రవరి 11న కన్య అనే అమ్మాయితో వివాహం జరిపించారు. కన్య బి.కాం. చదివింది. అందగత్తె. పాట భరతనాట్యం బాగా వచ్చును. తను వున్న చిన్న వన్ బెడ్ రూం ఫ్లాట్లోనే కాపరం పెట్టాడు. కన్య తండ్రి శేఖరంగారు ఐ.ఎ.ఎస్. ఆఫీసరు. వాళ్ళది విశాఖపట్నం. అక్కడే - ఆయన జిల్లా కలెక్టరు.

మూర్తి, కన్య కాపరం చేస్తూ ఆరునెలలయింది. మూర్తికి ఐదు అమెరికన్ యూనివర్సిటీల నించీ ఎడ్మిషన్, అసిస్టెంట్‌షిప్ వచ్చాయి.

మూర్తి 1964 సెప్టెంబర్ 11న ఎం.ఐ.టి.లో చేరాడు, భార్యని అత్తవారింట్లో విశాఖపట్నంకి పంపించి. మొత్తానికి మూర్తి కోరిక నెరవేరింది. ఎం.ఐ.టి.లో మాష్టర్స్ డిగ్రీ రాగానే భార్య కన్య 1965 సమ్మర్‌లో మూర్తిని చేరుకుంది. కన్య కూడా మెల్లిగా సమ్మర్ కోర్సులు తీసుకుంటూ 1968కల్లా ఎం.బి.ఎ. పూర్తి చేసింది.

మూర్తి 1968కి తను కలలు కంటున్న పి.హెచ్.డి. డిగ్రీ ఎం.ఐ.టి.లో సంపాదించాడు. కన్య న్యూయార్కు లో ఒక ఫైనాన్స్ కంపెనీలో చేరింది. మూర్తి కూడా న్యూయార్కులోనే ఒక పెద్ద కంప్యూటర్ కంపెనీలో రీశెర్చి డివిజన్‌లో సైంటిష్టుగా చేరాడు. మూర్తీ, కన్యా ఇద్దరూ కెరీర్సులో పడి న్యూయార్కు నగరంలో చాల కాలంగా స్థిరపడిపోయారు.

సంసారం పెరిగింది. ఇద్దరు పిల్లలు. అబ్బాయి రమేష్ స్టాక్ మార్కెట్‌లో బ్రోకర్. అమ్మాయి స్మిత ఐన్‌స్టెయిన్ మెడికల్ కాలేజీలో జెనెటిక్స్‌లో రీసెర్చి ఫిజీషియన్‌గా పనిచేస్తోంది.

మూర్తి కుటుంబం న్యూయార్కులోని భారతీయులందరి మధ్యా చాల పాపులర్ అయింది.

ఆరోజు మంగళవారం. సెప్టెంబర్ 11, 2001.

రోజూలాంటి వర్కింగ్ డే

మూర్తి స్నానం చేసి బట్టలు వేసుకుని ప్రొద్దున్నే ఏడు గంటలకల్లా రోజూ లాగానే ఇంటి దగ్గర బయల్దేరాడు. కన్య ఆ రోజు పనిలోకి వెళ్ళలేదు. ఎందుకంటే నాలుగేళ్ళ తన మనవరాలు లీనాని అమ్మమ్మ దగ్గర బేబీ సిట్టింగ్‌కి వదిలి, స్మిత అర్జంటుగా ఒక కాన్ఫరెన్స్‌కి వెళ్ళవలసి వచ్చింది కనుక.

మూర్తి ఏడూ పది కల్లా కమ్యూటర్ ట్రెయిన్ ఎక్కాడు. నీలి ఆకాశం అతి శాంతంగా సుందరంగా వుంది. ఒక కాఫీ కప్పు చేతిలో పట్టుకుని స్టార్ లెడ్జర్ న్యూస్ పేపర్, రోజూ లాగానే, తిరగేయటం మొదలెట్టాడు. రోజూ కలిసే తోటి ప్రయాణీకుడు జాన్‌తో పిచ్చాపాటీ చేస్తుండగా, ఇంతలో గమ్యస్థానం వరల్డ్ ట్రేడ్ సెంటర్ వచ్చేసింది.

జాన్‌కి సీయు లేటర్ అని చెప్పి ట్రెయిన్ దిగి నడవటం మొదలెట్టాడు.

తన గమ్యస్థానం 93వ ఫ్లోర్‌లో వున్న నార్త్ టవర్ ఆఫీసు. ఎలివేటర్‌లో తన ఫ్లోర్ రాగానే దిగి తన రూంకి చేరుకున్నాడు.

కోటు విప్పి హేంగర్‌కి తగిలిస్తూ వుంటే అతి కర్ణ కఠోరమైన శబ్దంతో సూటిగా తను వున్న టవర్ వేపు ఒక విమానం దూసుకు వస్తోంది.

ఒక్కసారి టవర్ దద్దరిల్లిపోయింది.

చీకటి కమ్ముకుంది.

అందరూ గందరగోళంగా అన్ని వైపులా పరుగెడుతున్నారు.

మూర్తి వాళ్ళతో పాటూ మెట్ల వైపు పరిగెత్తాడు.

కొంతమందితో పాటూ చాల ఫ్లోర్లు గబగబా దిగాడు.

క్రింద ఫ్లోర్ల నించీ పోలీసులు అరుస్తున్నారు - ‘త్వరగా... త్వరగా... ‘ అని.

లాబీలోకి వచ్చేశాడు.

కానీ ఈ లోపల టవరంతా కూలిపోయింది.

మూర్తి ఇక పైకి రాలేక పోయాడు.

0 0 0

(ఈ కథలో పేర్లు కల్పితాలు. ఈ కథా రచయిత మిత్రుడు సెప్టెంబర్ 11న అశువులు బాశాడు. ఆయనకే అంకితం)